

జూరాల గేట్ల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

# వరద హోరు

- కృష్ణ, తుంగభద్ర పరవళ్లు
- నిండుకుండల్లా ప్రాజెక్టులు
- సందర్శకులతో కిటకిట

*కృష్ణా, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. అటు ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం.. ఇటు తుంగభద్ర, సుంకేసుల ప్రాజెక్టులకు వరద హోరు కొనసాగుతున్నది. శ్రీశైలం డ్యాం మూడు గేట్లు తెరుచుకోవడంతో జలదృశ్యం ఆవిష్కృతమైంది. నల్లమల సిగలో కృష్ణమ్మ హొయలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఇప్పటికే ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి.*

రెడీ
వన్.. టూ.. త్రీ


శ్రీశైలం డ్యాం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న ప్రజలు


జూరాల డ్యాంపై స్తంభించిన ట్రాఫిక్


జూరాల డ్యాంపై సందర్శకులు


సందడిగా మహిళలు

## శ్రీశైలం డ్యాం గేట్లు ఓపెన్

- 3 గేట్ల నుంచి 77 వేల క్యూసెక్కులు
- 12 రోజుల్లోనే నిండిన ప్రాజెక్టు
- నల్లమల సిగలో కృష్ణమ్మ పరవళ్లు
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

నాగర్‌కర్నూల్, జూలై 29 (నమస్తే తెలంగాణ) : శ్రీశైలం జలాశయం నీటినిల్వలు గరిష్ఠ స్థాయికి చేరాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు రాయలసీమ అధికారులు 3 గేట్లను ఎత్తడంతో నురగలు కక్కుతూ కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. మొదట మంగళవారం గేట్లు ఎత్తాలని అధికారులు భావించినా భారీగా వస్తున్న ఇన్‌ఫ్లోతో ముందుగానే ప్రాజెక్టులోని 6, 7, 8వ నెంబర్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని వదులుతున్నారు. ఒక్కో గేటు నుంచి 27 వేల క్యూసెక్కుల చొప్పున 77 వేల క్యూసెక్కులు దిగువకు పారుతున్నాయి. జూరాల, సుంకేశుల నుంచి ఇప్పటికీ 4 లక్షల క్యూసెక్కులకుపైగా వరద వస్తున్నది. వరద ఇలాగే కొనసాగితే మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 880.20 అడుగులకు చేరగా.. సామర్థ్యం 215 టీఎంసీలు ఉండగా.. 189.4542 టీఎంసీలకు చేరింది. ఎడమ, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 1,39,220 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. అంతకు ముందే మత్స్యకారులతో పాటుగా పలు ప్రాంతాల ప్రజలను ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేశారు.

***12 రోజుల్లోనే..***

ఈ ఎండాకాలంలో కనిష్ఠ స్థాయికి జలాశయం నీటిమట్టం చేరగా.. ఈనెల 16 వరకు కేవలం 30 టీఎంసీలు, 806 అడుగుల మాత్రమే ఉన్నాయి. కానీ కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్‌కు భారీగా వరద రావడంతో నీటి విడుదల మొదలైంది. వారం రోజులుగా అక్కడి నుంచి విడుదల కొనసాగుతుండడంతో జలాలు శ్రీశైలానికి చేరుకున్నాయి. దీంతో 17న ముందస్తుగా శ్రీశైలం పవర్ హౌజ్ ద్వారా 7500 క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభమైంది. ఇలా కేవలం 12 రోజుల్లోనే నిరంతర వరద రాకతో ప్రాజెక్టుకు జలకళ సంతరించుకున్నది.

ప్రస్తుతం జూరాల 42 గేట్ల నుంచి 2,76,291 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తితో 18,755 క్యూసెక్కులు విడుదలవుతుండగా.. సుంకేసుల నుంచి 1,58,142 క్యూసెక్కుల చొప్పున 4,53,188 క్యూసెక్కుల వరద వస్తున్నది. గతేడాది ఒకేసారి కొద్ది రోజులు మాత్రమే డ్యాం గేట్లు తెరుచుకోగా ఈసారి జూలై చివరలోనే ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ప్రారంభమైంది. భారీ ఇన్‌ఫ్లో కారణంగా ఎడమ, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. దీని వల్ల 61,604 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇక డ్యాం ఆధారిత ఎత్తిపోతల పథకాలకు నీటి కొరత తప్పనున్నది. అలాగే తాగునీటికీ ఇబ్బందులు తీరనున్నాయి.

***పర్యాటక శోభ***

శ్రీశైలం డ్యాం పరిసరాల్లో పర్యాటకులు సందడి నెలకొన్నది. గేట్లు తెరుస్తారన్న సమాచారం మేరకు కొందరు ముందుగానే అక్కడకు చేరుకొని నీటి విడుదలను ఫోన్లల్లో చిత్రీకరించారు. మరికొందరు సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు.


శ్రీశైలం డ్యాం గేట్ల నుంచి నాగార్జునసాగర్‌కు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

## పర్యాటకుల సందడి

- జూరాల, శ్రీశైలం డ్యాంల వద్ద జనసందోహం
- సెలవులు రావడంతో పెరిగిన సందర్శకుల తాకిడి
- సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్న యువత

ధరూరు/అచ్చంపేట, జూలై 29 : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. జూరాల, శ్రీశైలం డ్యాం గేట్లను ఎత్తడంతో పర్యాటకులు పోటెత్తారు. దీంతో ప్రాజెక్ట్ పరిసరాలు కిటకిటలాడాయి. ఆది, సోమవారం సెలవు దినాలు కావడంతో తెలంగాణ నుంచే కాకుండా పక్క రాష్ర్టాల ప్రజలు కుటుంబసమేతంగా వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తునారు. ప్రాజెక్టుల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ యువత, మహిళలు సందడి చేస్తున్నారు. కొందరు అక్కడే బర్త్‌డే వేడుకలు కూడా నిర్వహించుకున్నారు. జూరాల ప్రాజెక్టు వద్ద భారీగా ట్రాఫిక్ జాం కాగా.. పోలీసులు వాహనాలు ఆగకుండా చర్యలు చేపట్టారు. ఎడమ కాల్వ వద్ద చేపల ఫ్రై రుచిని ఆస్వాదించేందుకు ప్రజలు ఎగబడ్డారు.

## తుంగభద్ర @ 1.26 లక్షల క్యూసెక్కులు

అయిజ, జూలై 29 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 1,88,194, అవుట్‌ఫ్లో 1,07,913 క్యూసెక్కులుగా నమోదైనట్లు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. పూర్తిస్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 97.410 టీఎంసీలుగా ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 1,36,800, అవుట్‌ఫ్లో 1,36,250 క్యూసెక్కులుగా నమోదైంది. ఆయకట్టుకు 550 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా.. ప్రస్తుతం 14 అడుగుల మేర నీటిమట్టం ఉన్న ట్లు ఏఈ రాందాస్ తెలిపారు. అలాగే ఆల్మట్టికి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3 లక్షల క్యూసెక్కుల చొప్పున ఉండగా.. డ్యాం గరిష్ఠస్థాయి నీటినిల్వ 129.72 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 67.967 టీ ఎంసీలుగా ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3 లక్షల క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 3,00,000 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠస్థాయి నీటినిల్వ 37.64 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 24.998 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.


ఆర్డీఎస్ ఆనకట్టపై నుంచి దిగువకు పారుతున్న వరద

## జూరాలలో 42 గేట్ల ఎత్తివేత

గద్వాల, జూలై 29 : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. దీంతో జూరాల ప్రాజెక్టుకు వరద రోజు రోజుకూ వరద పెరుగుతున్నది. సోమవారం ఎగువ నుంచి జూరాలకు 3,05,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో అధికారులు 42 గేట్లు ఎత్తి దిగువకు 2,76,219 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా.. ప్రస్తుతం 317.650 మీటర్లుగా ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.933 టీఎంసీలుగా నమోదైంది. జూరాల నుంచి విద్యుదుత్పత్తికి 18,755 క్యూసెక్కులు, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్-1కు 1,300, భీమా లిఫ్ట్-2కు 750, ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 658, కోయిల్‌సాగర్‌కు 315, సమాంతర కాల్వకు 900 క్యూసెక్కులను వదులుతున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తం 2,99,762 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

## దిగువ జూరాలలో నిలిచిన విద్యుదుత్పత్తి

- ఎగువ జూరాలలో కొనసాగింపు

ఆత్మకూరు, జూలై 29 : దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో మూడు రోజులుగా విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఎగువ నుంచి వస్తున్న భారీ వరద కారణంగా పవర్ ప్రాజెక్ట్ యంత్రాలకు ముప్పు వాటిల్లే ప్రమాదమున్న పరిస్థితుల్లో విద్యుదుత్పత్తి నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఎగువ జూరాలలో విద్యుదుత్పత్తి నిర్విరామంగా కొనసాగుతుంది. ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతుండగా ఆదివారం అర్ధరాత్రి వరకు 2.93 మి.యూ ఉత్పత్తి కాగా ఇప్పటివరకు మొత్తంగా 31.318 మి.యూ ఉత్పత్తి జరిగింది. దిగువ జూరాలలో మూడు రోజుల కిందటి వరకు విద్యుదుత్పత్తి జరుగగా అప్పటి వరకు 32.995 మి.యూ ఉత్పత్తి జరిగింది. సోమవారం జూరాలకు 3.18 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగడడంతో దిగువ జూరాలలో విద్యుదుత్పత్తికి అవకాశం లేకుండా పోయిందని ఎస్ఈ కల్లూరి సుబ్బరామిరెడ్డి తెలిపారు. 2లక్షల క్యూసెక్కుల దిగువకు ఇన్‌ఫ్లో ఉంటేనే దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి నిర్వహించగలమని స్పష్టంచేశారు.


అమ్రాబాద్‌లో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న అటవీ శాఖ సిబ్బంది

## అంతర్జాతీయ పులుల దినోత్సవం

- మన్ననూర్‌లో విద్యార్థులతో కలిసి అటవీ, పోలీస్ సిబ్బంది ర్యాలీ
- మన్ననూరులో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహణ

అమ్రాబాద్, జూలై 29 : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మన్ననూర్‌లోని పర్యావరణ కేంద్రంలో విద్యార్థులకు 'ప్రకృతి పరిరక్షణలో పులుల ప్రాముఖ్యత'పై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. అంతకుముందు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని దోమలపెంట, అమ్రాబాద్‌లో మన్ననూర్ అటవీ, పోలీస్ సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ, అడవులు, ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలను నాటారు. మన్ననూర్ పాఠశాల విద్యార్థులకు ట్రెక్కింగ్‌లో భాగంగా ప్రతాపరుద్రుడి కోటకు తీసుకెళ్లి అక్కడ వృక్ష, జంతుజాలం గురించి వివరించారు. నేచర్ గైడ్స్ వారికి పక్షుల వీక్షణ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ గోపిడీ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో పులుల ప్రాముఖ్యత ఎంతో ఉంటుందన్నారు. అనంతరం ఈఈసీలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ దాతలను సన్మానించారు. అటవీశాఖకు, సిబ్బందికి వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ ట్రెయినీ సుశాంత్ బోబడే, అమ్రాబాద్, దోమలపెంట, మన్ననూర్ అటవీ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.


పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు

## రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 29 : జాతీయ జావెలిన్ త్రో దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో వచ్చే నెల 7వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జావెలిన్‌త్రో పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి వందమంది క్రీడాకారులు ఎంపికయ్యారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని స్టేడియంలో నిర్వహించిన ఎంపికలను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శులు సాదిక్‌అలీ, కె.రమేశ్‌బాబు ప్రారంభించారు. అండర్-14, 16, 18, 20 క్రీడాకారులకు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో పోటీలను వేర్వేరుగా నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఎంపికలను చేపట్టారు. ఒక్కో జిల్లా నుంచి 20 మంది చొప్పున వంద మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ సునీల్, సీనియర్ అథ్లెటిక్స్ పి.శ్రీనివాస్, సి.శ్రీనివాస్, పీడీ, పీఈటీలు వడెన్న, శ్రీనివాస్, జగదీశ్, ఎం.శ్రీనివాసులు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చల్లంగ చూడమ్మా..

- ఎదిరలో ఘనంగా బోనాల వేడుక
- బంగారు మైసమ్మకు నైవేద్యాల సమర్పణ
- ఆకట్టుకున్న శివసత్తుల విన్యాసాలు
- పూజలు చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


ఆంజనేయస్వామి ఆలయం నుంచి బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు




డోలు వాయిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పాలమూరు, జూలై 29 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నాలుగో వార్డు ఎదిరలో సోమవారం బంగారు మైసమ్మ బోనాల ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలతో మహిళలు ఊరేగింపుగా బయలుదేరారు. శివసత్తులు, యువకులు, డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఉత్సాహం నింపారు. ఈ ఉత్సవాలలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పుర చైర్మన్ ఆనంద్‌గౌడ్ బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తులతో కలిసి డోలు వాయించారు. ఈ సందర్భంగా వార్డు పెద్దలు పెద్ద ఎత్తున శ్రీనివాస్ గౌడ్‌కు స్వాగతం పలికారు. యువకులు పెద్దఎత్తున ఈయనతో సెల్ఫీలు తీసుకొని తమ అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదమ్మాహనుమంతు, మాజీ కౌన్సిలర్ శివశంకర్, మాజీ సర్పంచ్‌లు జంగన్న, వెంకటయ్యగౌడ్, సూద నర్సింహులు, ఎల్లయ్య, రాములు, శేఖర్, శ్రీనివాసులు, ఆంజనేయులు, శేఖర్, కృష్ణ, హకీం, సత్యం, నర్సింహులు, వార్డు యువకులు, మహిళలు పాల్గొన్నారు.


***హైదరాబాద్‌లో అమ్మవారికి పూజలు..***

హైదరాబాద్‌లోని లాల్ దర్వాజలోని సింహవాహిణి మహంకాళి అమ్మవారిని సోమవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబసమేతంగా దర్శించుకొని పూజలు చేశారు. అలాగే ఉప్పుగూడలోని బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## పాలనలో విఫలమైన కాంగ్రెస్

- గద్వాల నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో ఎమ్మెల్యే వివరించాలి
- బీఆర్ఎస్ నేత నాగర్‌దొడ్డి వెంకట్రాములు


గద్వాల, జూలై 29 : ప్రజలకు పాలన అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో ఎనిమిది నెలలుగా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కేఎస్ హాల్‌లో సోమవారం కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గద్వాల నియోజకవర్గంలో అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొంటామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని చెబుతున్న గద్వాల ఎమ్మెల్యే ఏయే పనుల నివేదికలను సీఎం ముందు ఉంచారో వివరించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి చాలా మంది వచ్చారని, కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసమే ఇందుకు నిదర్శనమన్నారు. కష్టపడి పనిచేసిన వారికే సముచిత స్థానం కల్పించనున్నట్లు అధిష్ఠానం చెప్పిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి, పల్లయ్య, జయరామిరెడ్డి, మద్దిలేటి, జనార్దన్‌రెడ్డి, దామోదర్, రాము, సృజన, మగ్బూల్, బాబుగౌడ్, నర్సింహ, కృష్ణ పాల్గొన్నారు.


నాయకులతో కలిసి నినాదిస్తున్న వెంకట్రాములు

## గులాబీ పార్టీదే భవిష్యత్తు

- బీఆర్ఎస్ నాయకుడు బాసు హన్మంతునాయుడు

కేటీదొడ్డి, జూలై 29 : భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని, అందరూ ధైర్యంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకుడు బాసు హన్మంతు నాయుడు పేర్కొన్నారు. మండలంలోని పాగుంట, వెంకటాపురం, కొండాపురం గ్రామాల్లో సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన మేలు మనం మర్చిపోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికీ నచ్చట్లేదన్న విషయం మీ అందరికి తెలుసన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఈపాటికి రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవన్నారు. అందరి వెంట తాను ఉంటానని, బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు మీ అందరి సహకారం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోనేశ్, రాజు నాయుడు, నాగరాజు, వీరన్న, గోవర్ధన్, గోవిందు, ప్రహ్లాద్, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాసు హన్మంతునాయుడు